




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం

23 ఏప్రిల్ 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## కల్లులో కల్తీకి డ్రగ్స్..
## హైదరాబాద్‌లో 17 కోట్ల మత్తుపదార్థాలు సీజ్!



- హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించిన ఎన్‌సీబీ
- మౌలాలిలో రూ.17.40 కోట్ల విలువైన అల్ప్రజోలామ్ స్వాధీనం
- కల్లులో కల్తీ చేసేందుకు డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు వెల్లడి
- ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న అధికారులు


## ట్రక్కు బీభత్సం..
## కాలి బూడిదైన 11మంది ప్రయాణికులు



- ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఘటన
- బ్రేకులు ఫెయిల్ కావడంతో పలు వాహనాలను ఢీకొట్టిన ట్రక్కు
- బొలెరో వాహనంలో మంటలు చెలరేగి 11 మంది సజీవ దహనం
- మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందన్న పోలీసులు
- ప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశం

## తెలంగాణలో
## ఆరుగురు ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ హోదా

- పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- డీజీగా పదోన్నతి పొందినవారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సజ్జనార్
- లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్






## రైతులు, ప్రజల విజయమిదే: కేటీఆర్

**హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ కుతంత్రాలకు చెక్**

**కాంగ్రెస్--బీజేపీ కలసి పని చేస్తున్నాయన్న ఆరోపణ**

**పాలనపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచన**

హైదరాబాద్: తెలంగాణ ఉన్నంతకాలం కాళేశ్వరం ప్రాజెక్టు నిలిచే ప్రాజెక్టేనని, గోదావరి ప్రవహించేంతవరకూ దాని రూపకర్తగా మాజీ సీఎం కేసీఆర్ పేరు నిలిచిపోతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు కేవలం ఒక న్యాయ నిర్ణయం మాత్రమే కాకుండా రాజకీయంగా జరుగుతున్న కుట్రలకు గట్టి చెక్ పెట్టిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేసీఆర్‌పై అబద్ధ ఆరోపణలు, దుష్ప్రచారం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చేసిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కోర్టు తీర్పుతో ఆ కుట్రలన్నీ కూలిపోయాయని, ఇది రైతులు మరియు రాష్ట్ర ప్రజల విజయం అని వ్యాఖ్యానించారు. ఘోష్ కమిషన్ నివేదికపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ నివేదికకు విశ్వసనీయత లేదని, అది అసలు నిష్పక్షపాత విచారణ కాదని, రాజకీయ ప్రేరేపిత పత్రంగా మారిందని

- మిగతా 2వ పేజీలో

# కేసీఆర్, హరీశ్‌కు ఊరట

### ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలొద్దు: హైకోర్టు

### సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘనపై హైకోర్టు సీరియస్

**ఆరోపణలు అర్థరహితమన్న ధర్మాసనం.. కమిషన్ పరిధి మించిందని అభిప్రాయం**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆ నివేదికను ఆధారంగా తీసుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ సీఎస్ ఎస్‌కే జోషి, మాజీ ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నివేదికలో పేర్కొన్న ఆరోపణలు అర్థరహితంగా ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణ పేరుతో కమిషన్ తన పరిధిని దాటి వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని గట్టిగా పేర్కొంది. నిర్ధారిత విధానాలు, చట్టపరమైన నిబంధనలు పాటించకుండా నివేదిక సిద్ధం చేసిన తీరు ఆమోదయోగ్యం కాదని తెలిపింది. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం సుదీర్ఘ వాదనలు విన్న అనంతరం ఈ తీర్పును ప్రకటించింది. విచారణ సమయంలో సంబంధిత వ్యక్తులకు తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఆరోపణలు చేసే ముందు నోటీసులు ఇవ్వకపోవడం, ఆధారాలు అందించకపోవడం వంటి అంశాలను కోర్టు తీవ్రంగా పరిగణించింది. సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం కల్పించాల్సిన రక్షణలను పాటించకపోవడం

- మిగతా 2వ పేజీలో



## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన

ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన

ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి

దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా సంస్థలు రాష్ట్రంలో త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అన్నారు.

## హర్మూజ్ జలసంధిలో కొత్త టెన్షన్..
# ఇంటర్నెట్ కేబుళ్లపై ఇరాన్ హెచ్చరిక!

గల్ఫ్‌లో ఇంటర్నెట్ కేబుళ్ల భద్రతపై ఇరాన్ అనుకూల మీడియా హెచ్చరిక

హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే కేబుళ్లు లక్ష్యంగా మారవచ్చని సూచన

కేబుళ్లు దెబ్బతింటే గల్ఫ్ దేశాల కనెక్టివిటీకి తీవ్ర విఘాతం తప్పదని ఆందోళన

ఇది గల్ఫ్ దేశాలకు ఇరాన్ పంపుతున్న వ్యూహాత్మక సంకేతమన్న విశ్లేషకులు



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ అనుకూల మీడియా నుంచి ఒక కొత్త హెచ్చరిక వెలువడింది. గల్ఫ్ ప్రాంతంలో తదుపరి సంక్షోభం చమురు రవాణా మార్గాల్లో కాకుండా, సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుళ్ల ద్వారా రావచ్చని పరోక్షంగా సూచించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ఇరాన్‌కు చెందిన తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన ఒక నివేదిక హర్మూజ్ జలసంధిలోని సముద్రగర్భ డేటా కేబుళ్ల బలహీనతను ఎత్తి చూపింది. "ప్రమాదవశాత్తు లేదా ఉద్దేశపూర్వకంగానైనా ఒకేసారి అనేక ప్రధాన కేబుళ్లకు నష్టం జరిగితే, పర్షియన్ గల్ఫ్ వ్యాప్తంగా తీవ్ర అంతరాయాలు ఏర్పడతాయి" అని ఆ నివేదిక

- మిగతా 2వ పేజీలో



ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్య..

## ఖర్గేకు ఈసీ నోటీసులు


- ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్యల ఆరోపణలపై ఖర్గేకు ఈసీ నోటీసు
- 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడికి ఆదేశం
- ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేసిన బీజేపీ
- తన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ఖర్గే వివరణ

## భారత్‌ను తాకితే 'డాట్ డాట్ డాట్'.. పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్!

పహల్గాం ఉగ్రదాడికి ఏడాది

జర్మనీ నుంచి పాక్‌కు హెచ్చరికలు జారీ చేసిన రాజ్‌నాథ్

భారత్ సైనిక శక్తి మరింత పెరిగిందని వ్యాఖ్య



పహల్గాం ఉగ్రదాడి జరిగి నేటికి సరిగ్గా ఏడాది. పహల్గాం సమీపంలోని బైసరణ్ వ్యాలీలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జర్మనీ పర్యటనలో ఉన్నప్పటికీ, అక్కడి నుంచే పాకిస్థాన్‌కు అత్యంత శక్తిమంతమైన హెచ్చరికలు జారీ చేశారు. "భారత్ తనంతట తానుగా

- మిగతా 2వ పేజీలో

# సగరపుత్రుల ఆత్మ శాంతి కోసం స్వర్గంలో ఉన్న గంగానదిని భూమి పైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భగీరథ మహర్షి హిందూ పురాణాల ప్రకారం, సూర్యవంశానికి చెందిన ఇక్ష్వాకు వంశ రాజు. తన పూర్వీకులైన సగర పుత్రుల ఆత్మశాంతి కోసం, స్వర్గంలో ఉన్న గంగానదిని భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి. తీవ్రమైన తపస్సుతో గంగను, శివుడిని ప్రసన్నం చేసుకుని, గంగను భూమికి తెచ్చినందుకు ఆయనకు "భగీరథ ప్రయత్నం" అనే మాట ఆదర్శంగా నిలిచింది

**భగీరథ మహర్షి జీవిత విశేషాలు:**

వంశం: దిలీపుని కుమారుడు, సగరుని మునిమనమడు. ఇక్ష్వాకు వంశానికి చెందిన రాజు

**ముఖ్య ఉద్దేశ్యం:**


కపిల మహర్షి శాపం వల్ల భస్మమైన 60,000 మంది సగర పుత్రులకు (తాతల తరానికి) గంగాజలంతో తర్పణం విడిచి, వారి ఆత్మలకు విముక్తి (మోక్షం) కల్పించడం

**భగీరథ ప్రయత్నం:**

గంగ భూమిపైకి వస్తే ఆ ఉధృతికి భూమి తట్టుకోలేదని గ్రహించి, శివుని ప్రసన్నం చేసుకుని తన జటాజూటంలో గంగను ధరించేలా చేశాడు

**గంగావతరణ:**

గంగ శివుని జటల నుండి భూమిపైకి, తర్వాత సగర




పుత్రుల బూడిదపై ప్రవహించి, వారికి మోక్షం కలిగించింది



**ప్రాముఖ్యత:**

పట్టుదల, నిశ్చల దీక్షకు భగీరథుడిని ఆదర్శంగా తీసుకుంటారు. ఈయన జయంతి వేడుకలను ఉప్పర/సగర కులస్తులు ఘనంగా నిర్వహిస్తారు. గంగను భూమికి తీసుకురావడం వల్ల ఆమెకు "భగీరథి" అని, ఆయన ప్రయత్నాన్ని "భగీరథ ప్రయత్నం" (అసాధ్యమైన పనిని సాధ్యం చేయడం) అని అంటారు

**వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో, నెట్వర్క్ ఇంచార్జ్ గొల్లూరి గణేష్ సాగర్**

# ఘనంగా మాజీ మంత్రి ఇంద్రారెడ్డి

**- నివాళులర్పించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో ఇంద్రారెడ్డి కీలక పాత్ర పోషించారన్న అనిల్ యాదవ్**

బాలాపూర్, వార్త మిర్రర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోమ్ శాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రా రెడ్డి గారి 26వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వస్థలం (చేవేళ్ళ) కౌకుంట్ల లోని వ్యవసాయ క్షేత్రంలో మీర్ పేట్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం మొదటి నుంచి ఇంద్రారెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విద్యా, హోం శాఖ మంత్రిగా వ్యవహరించిన ఆయన రాష్ట్ర అభివృద్ధి తో పాటు ప్రత్యేకించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో తనదైన మార్క్ చూపించారన్నారు. ఇంద్రారెడ్డి బాటలోనే రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి కూడా అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా స్మారక ఘాట్ వద్ద నివాళులు అర్పించిన రాష్ట్ర మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి , బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ నియోజకవర్గం ఇన్చార్జి యువ నాయకులు కార్తీక్ రెడ్డి లతో కలిసి నివాళు లు అర్పించిన వారిలో ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ తో పాటు,ధనలక్ష్మి రాజ్ కుమార్ మరియు స్థానిక నాయకులు ఉన్నారు.



# సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధికి చేయూత

**- ధ్వజస్తంభం తొడుగుకు రూ.3.30 లక్షల**

**- దాతలకు చైర్మన్ కృతజ్ఞతలు**

కీసర,వార్త మిర్రర్, ఏప్రిల్ 22:

కీసరలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కీసర అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తమ భక్తి, సేవాభావాన్ని చాటుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు పన్నాల ప్రభాకర్ రెడ్డి (పప్పు అన్న) జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు ఆలయానికి ఉదారంగా విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన సోదరుడు పన్నాల సుధాకర్ రెడ్డి -- జ్యోతి రాణి దంపతులు, సోదరి కందకట్ల సుజాత -- కీర్తిశేషులు సంజీవరెడ్డి (రాఘవాపురం) కుటుంబ సభ్యులు కలిసి ఆలయ ధ్వజస్తంభం తొడుగు నిర్మాణానికి సుమారు రూ.3.30 లక్షలు విరాళంగా అందించారు. రిటైర్డ్ టీచర్ భాస్కర రావు లక్ష 16 వేల రూపాయల విరాళం అందజేశారు .దాతల ఈ సేవలను అభినందించిన ఆలయ చైర్మన్ రాయిల శ్రవణ్ కుమార్ గుప్తా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కీర్తిశేషులు పన్నాల ప్రభాకర్ రెడ్డి చూపిన భక్తి మార్గంలో నడుస్తూ, స్వామివారి సేవలో తరిస్తామని, తమ వంతు దేవాలయ



అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తామని కమిటీ సభ్యులు మనవి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బెల్దే రమేష్ గుప్తా, గుర్రం మల్లారెడ్డి, రామిడి ప్రభాకర్ రెడ్డి, నల్ల వెంకటరెడ్డి, బండారి శంకర్ గౌడ్, రమేష్ గౌడ్, జూపల్లి రవీందర్,పన్నాల సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు సాయి కిరణ్, వర్షిత్, నీలాక్షి, జ్యోతి రాణి రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దాతలందరికీ సీతారామచంద్ర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ ఆకాంక్షించింది.

# ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

దీంట్లో భాగంగా ఆ ప్లాంట్కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

**త్వరలో రాయలసీమలో మరో భారీ ప్లాంట్**

రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో



ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా, త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గంలో విండ్ ప్రాజెక్ట్తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు వరుస కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది.

# నౌకలపై ఇరాన్ దాడి

దుబాయ్: పాక్ ప్రాయోజిత శాంతి చర్చల ప్రక్రియకు తూట్లు పొడుస్తూ ఇరాన్ హార్మూజ్ జలసంధిని మరోమారు కాల్పులమోతకు వేదికగా మార్చేసింది. శాంతి చర్చలకు ఫలవంతమైన ప్రతిపాదనలతో ఇరాన్ వచ్చేవరకు కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే విదేశీ నౌకలపై ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్జీసీ) నేవీ బలగాలు దాడులపర్వానికి తెరలేపాయి. ఇటీవల కొన్ని గంటలపాటు హార్మూజ్ను పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ చేసిన ప్రకటనతో పర్షియన్ గల్ఫ్ నుంచి ఆశగా బయల్దేరిన నౌకలు గురువారం హార్మూజ్ జలసంధిని దాటే క్రమంలో వాటిపైకి ఐఆర్జీసీ నేవీ గన్బోట్లు తుపాకులు ఎక్కుపెట్టాయి. దీంతో మూడు నౌకలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మూడింటిలో రెండింటిని ఇరాన్ స్వాధీనంచేసుకుని తమ తీరానికి తీసుకెళ్తున్నాయి. మరోవైపు ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్కు బయల్దేరని కారణంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సారథ్యంలోని బృందం సైతం పాకిస్తాన్కు బయల్దేరలేదు. దీంతో రెండో దఫా చర్చలు సాధ్యపడలేదు. అయితే చర్చలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయేగానీ రద్దుకాలేదని అమెరికా వ్యాఖ్యానించింది. శుక్రవారంలోపు రెండోదఫా చర్చలు జరిగే వీలుందని ట్రంప్ చెప్పినట్లు 'ది న్యూయార్క్ పోస్ట్'తన కథనంలో పేర్కొంది. మరోవైపు బుధవారంతో ముగిసిపోతున్న కాల్పుల విరమణ గడువును ట్రంప్ హఠాత్తుగా పొడిగించడంపై మధ్యవర్తిత్వ దేశం పాకిస్తాన్ హర్షం వ్యక్తంచేసింది.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

# మనకు ఓ టైమ్ వస్తుంది..

పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి భారతదేశానికి కూడా ఒక సమయం వస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్సింగ్ అన్నారు. ప్రస్తుతం రాజ్నాథ్సింగ్ జర్మనీలో పర్యటిస్తున్నారు. బెర్లిన్లో భారతీయ సమాజం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి భారతదేశ పాత్ర ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూడ "భారతదేశం ప్రయత్నించిందని.. అయినా ప్రతిదానికీ ఒక సమయం ఉంటుంది. రేపన్న రోజున భారతదేశం ఆ పాత్రను పోషించి విజయం సాధించే సమయం రావొచ్చు. ఆ అవకాశాన్ని మాత్రం కొట్టిపారేయలేం. యుద్ధాన్ని ముగించాలని ఇరుపక్షాలకు ప్రధాని మోడీ ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. దౌత్యపరమైన విషయాల్లో మోడీకి చాలా సమతుల్య వైఖరి ఉంది." అని పేర్కొన్నారు. "రష్యా అధ్యక్షుడు పుతిన్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కలిసినప్పుడు కూడా యుద్ధం గురించి మోడీ చర్చించారు. యుద్ధం ముగించాలని కోరారు. రేపు ట్రంప్ను కలిసినప్పుడు కూడా చర్చించి ఒక పరిష్కారం కనుగొనాలని చెప్పారు. భారతదేశం వ్యవహరిస్తున్న తీరును మీరు చూసే ఉంటారు. హార్మూజ్ జలసంధి నుంచి ఏ దేశానికి చెందిన నౌక వెళ్లలేకపోయింది. కానీ భారతదేశానికి చెందిన 7-8 నౌకలు వెళ్లగలిగాయి. దీనికి కారణం భారతదేశ వ్యవహరిస్తున్న సమతుల్య వైఖరే కారణం." అని రాజ్నాథ్సింగ్ వివరించారు.

## చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయి

రాయలసీమ నీటి హక్కుల కోసం వైసీపీ పోరాటానికి సిద్ధమవుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం సీమ ప్రాజెక్టులను గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ముందుచూపుతో చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చంద్రబాబు అడ్డుకున్నారని, దీనివల్ల సీమ రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని, అందుకే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బాబు మెతక వైఖరి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల పేరు చెప్పుకుని 'నీరు-చెట్టు' పథకం ద్వారా గతంలో టీడీపీ నేతలు దోచుకున్నారని, ఇప్పుడూ అదే బాటలో సాగుతున్నారని విమర్శించారు. రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు మెడలు వంచి ప్రాజెక్టులను సాధించుకుందామని, అందుకు రైతులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## మోడీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు

'టెర్రరిస్ట్" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడుతోంది. కేంద్రమంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, పరువు నష్టం కలిగించే చర్య అని, ఎన్నికలను ప్రభావితం చేయగల తీవ్రమైన ఆరోపణ అని పేర్కొంది. ఖర్గేపై చర్య తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. మోడీని "ఉగ్రవాది" అని పిలవడం వ్యక్తిగత దూషణ, తీవ్రమైన వ్యక్తిగత దాడి, ప్రజల ప్రజాస్వామ్య ఎంపికను ప్రభావితం చేసే ప్రయత్నమని బీజేపీ పేర్కొంది. ఈ వ్యాఖ్య భారత శిక్షా స్మృతి (ఐపీసీ), 2023లోని సెక్షన్లు 175, 171/174 (అనుచిత ప్రభావం), 356(1) (పరువు నష్టం)తో సహా వివిధ సెక్షన్ల కింద శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుందని తెలిపింది.



## ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నాయకుల ఆగ్రహం

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (వార్త మిర్రర్):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తార్నాక డివిజన్‌లో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. లాలాపేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధాని గురించి అనుచిత పదజాలంతో మాట్లాడటం తగదని, ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని వారు సూచించారు. ఈ నిరసన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉపేందర్ యాదవ్‌తో పాటు వెంకటేష్ గౌడ్, వేణు యాదవ్, పోచయ్య యాదవ్, సుబ్బారావు, వీరన్న,రాము వర్మ, బిక్షపతి యాదవ్, జమ్మికుంట వేణు తదితరులు పాల్గొన్నారు.



## మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో సి ఎం ఎస్ క్లీన్ స్వీప్ కార్యక్రమం..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : సైబర్‌బాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్, ప్రశాంత్ నగర్, స్టాలిన్ నగర్, ఎం.ఎ నగర్ కాలనీల లో నిర్వహించిన సైబర్‌బాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్ లో భాగంగా మియాపూర్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ , తాజ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సి ఎం సి అధికారులు, జలమండలి అధికారులు మరియు కాలనీ వాసుల తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించిన పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ . కాలనీలలో క్లీన్ గా ఉంచాలనే ఉద్దేశంతో కాలనీలలో నివసించే ప్రతీ ఒక్కరూ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, మోహన్ ముదిరాజ్, గంగాధర్, వినోద్, చిన్నా, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.


## నాచారంలో మేడపై గంజాయి మొక్కల పెంపకం

### ఎక్సైజ్ అధికారుల దాడి
### సాఫ్ట్వేర్ ఉద్యోగి అరెస్ట్
### 17 గంజాయి మొక్కలు స్వాధీనం





కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 22 : అతను ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి. ఏసీ గదుల్లో కూర్చుని లక్షల్లో జీతం తీసుకుంటాడు. అయినా డబ్బుపై మక్కువతో ఏకంగా ఇంటిపై గంజాయి మొక్కలను పెంచడం మొదలుపెట్టాడు. సమాచారం అందుకున్న ఘట్కేసర్ ఎక్సైస్ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. సోమవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే నాచారం సర్కిల్ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్ కాలనీ లో ఓ సాఫ్ట్వేర్ చల్ల శశిధర్ నివాసం ఉంటున్నాడు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అంటే సమాజంలో గౌరవం. నెలకు లక్షల్లో జీతాలు. ఏసి గదులు కూర్చొని చేసే పని. కానీ ఓ సాఫ్ట్వేర్ ఇంజనీర్ మాత్రం ఆ గౌరవాన్ని గంగలో కలిపారు. కోడింగ్ చేయాల్సిన చేతులతో గంజాయి మొక్కలకు నీళ్లు పోశాడు. అవును నాచారంలో ఓ సాఫ్ట్వేరు తన ఇంటిపై గంజాయి మొక్కలను పెంచడం కలకలం రేపుతుంది. నాచారంలోని ఈస్ట్ గాంధీనగర్ లో నివాసముండే చల్లా శశిధర్ ఇంటిపై గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. ఘట్కేసర్ ఎక్సైజ్ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేశారు. సోమవారం ఉదయం ఎక్సరైజ్ అధికారులు ఆ ఇంటిని ఆకస్మిక తనిఖీ చేశారు. మేడ పైకి వెళ్లిన ఎక్సైజ్ అధికారులు ఆ దృశ్యం చేసి ఆశ్చర్యపోయారు. అక్కడ పూల మొక్కలకు బదులు ఏపుగా పెరిగిన 17 గంజాయి మొక్కలు వారికి దర్శనమిచ్చాయి. ఈ మొక్కల విలువ మార్కెట్లో లక్షల్లో ఉంటుందని నిందితుడు చల్లా శశిధర్ భావించారు. నిందితున్ని అరెస్టు చేసి ఘట్కేసర్ ఎక్సైస్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కేసు నమోదు చేసి ఘట్కేసర్ ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.



## పుల్లెంల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

### దాన్యం కొనుగోలను వేగవంతం చేయాలి- సర్పంచ్ ముక్కాముల వెంకన్న

వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో చండూర్ మండలం పుల్లెంల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ ముక్కముల వెంకన్న గారు ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ధాన్యం ఎలా వస్తోందని, తేమ శాతం ఎంత ఉంటుందని అధికారులను ఐకేపీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని,ఇందుకోసం వంద శాతం ట్యాప్ ఎంట్రీ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు.పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పవన్,ఐకేపీ సీసీ అంజయ్య, రైతులు గోపిడి శేఖర్ రెడ్డి,పాక యాదయ్య,ఈరటి క్రిష్ణయ్య, చెరుకు వెంకటేశం, మార్కెటింగ్ కమిటీ సభ్యులు మహిళా సంఘం అధ్యక్షురాలు చెడుబుద్ధి లక్ష్మమ్మ, గండు తిరుమలమ్మ,జాజుల రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలి....

### రవికుమార్ యాదవ్...



మియాపూర్ వార్త మిర్రర్ : ఆర్టీసీ కార్మికుల తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని హెచ్‌సీయూ డిపో మరియు మియాపూర్ డిపో గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ సంపూర్ణ మద్దతు తెలియచేసారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు.. యూనియన్లను పునరుద్ధరించాలని, 2021, 2025 వేతన సవరణ, 2017 పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సహా అన్ని సమస్యలను ఈ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్న కార్మికులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వారి డిమాండ్లను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు సాధించుకునేందుకు చేస్తున్న పోరాటానికి.. ఆర్టీసీ కార్మికుల పక్షాన భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియచేసారు. ఇకనైనా ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రాము, రాఘవేంద్ర, దరగయ్య, సుభాష్ గౌడ్, శ్రీనివాస్, రాజాబాబు మొదలగు వారు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డికి ఘన నివాళి అర్పించిన సబితా ఇంద్రారెడ్డి

### ప్రజల కోసం జీవించిన నాయకుడు...ఇంద్రా రెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :

చేవెళ్ల నియోజకవర్గం కౌకుంట్ల గ్రామంలో స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రా రెడ్డి సమాధి వద్ద పూలమాల వేసి అశ్రునయనాలతో ఘన నివాళి అర్పించారు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాజేందర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పట్లోళ్ల కౌశిక్ రెడ్డి పట్లోళ్ల కళ్యాణ్ రెడ్డి ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రా రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకమైన ముద్ర వేసిన గొప్ప ప్రజానాయకుడు అని పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రజాసేవనే తన జీవిత లక్ష్యంగా ఎంచుకుని, గ్రామీణ ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం, అందరికీ అందుబాటులో ఉండే నాయకత్వం ఆయనను ప్రజల హృదయాల్లో ఇంద్రన్న గా నిలిపిందన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ ఎప్పుడూ వినమ్రతను వదలలేదని, ముఖ్యంగా రైతులు, పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.మంత్రిగా పనిచేసిన సమయంలో పరిపాలనా నైపుణ్యం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చి మంచి పేరు సంపాదించారని, ప్రజల సమస్యలపై వెంటనే స్పందించడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా మానవతా దృక్పథంతో ముందుకు సాగిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. అకాల మరణం తెలంగాణ రాజకీయాలకు తీరని లోటుగా నిలిచిందని, అయినప్పటికీ ఆయన ఆలోచనలు, సేవలు ఈ రోజుకీ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. ప్రజల కోసం జీవించిన నాయకుడు మరణించడు... ఆయన జ్ఞాపకాలు, సేవలు ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని స్మరించుకుంటూ "ఇంద్రారెడ్డి అమరహే" నినాదాలతో చేవెళ్ల పట్టణం మారుమోగింది. ఈఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులుభారీ సంఖ్యలో ఇంద్రారెడ్డి అభిమానులు, నలుమూలల నుంచి తరలివచ్చిన సబితా ఇంద్రారెడ్డి అభిమానులు మరియు పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా, రైతు భరోసా, ఆసుపత్రుల్లో మందుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందన లేదు

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ఘాటు విమర్శలు..
- రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్
- ఎంపీటీసీ ఎన్నికల తర్వాత ఒంటరిగా కానున్న ఎమ్మెల్యే
- తన హయాంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 22

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయి కాని చేతలు గడప కూడా దాటవని మాజీ ఎమ్మెల్యే తీసుకుంట ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పై ఘాటు విమర్శలు చేశారు. అధికార పార్టీలో ఉండి కూడా ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గానికి కనీసం నిధులు తీసుకురాలేని అసమర్థుడన్నారు. మునుగోడు ప్రాంత భౌగోళిక స్వరూపం గురించి కనీస అవగాహన లేదని, కేవలం తన ఉనికి, మంత్రి పదవి కోసం మాత్రమే ఎమ్మెల్యే తాపత్రయ పడుతున్నారని,సోషల్ మీడియాలో రీల్స్ పెట్టించుకుని హైప్ క్రియేట్ చేసుకోవడం తప్ప వాస్తవ అభివృద్ధి లేదని, అభివృద్ధి రీల్స్‌లో మాత్రమే కనిపిస్తుందన్నారు. నేను కేసీఆర్ మార్గదర్శకత్వంలో మునుగోడు నియోజకవర్గానికి వందల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఫ్లోరైడ్ నిర్మూలన, రెండు మున్సిపాలిటీలు ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం, 100 పడకల ఆసుపత్రి అమలు చేశామన్నారు. చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ పనుల్లో ఎలివేటెడ్ కారిడార్ కోసం, బస్టాండ్ వద్ద 30 ఫీట్ల అండర్‌పాస్ కోసం మేము పోరాటం చేస్తున్నాం, ఎమ్మెల్యేకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. రైతులకు యూరియా, రైతు భరోసా, ఆసుపత్రుల్లో మందుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందన లేదన్నారు. ఎంపీటీసీ ఎన్నికలు అయిపోయే సరికి మీ పార్టీలో గెలిచిన వారిలో ఒక్కరూ కూడా మిగలరన్నారు. నిజంగా దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని – ప్రజలు ఎవరిని గెలిపిస్తారో తెలుస్తుందని కూసుకుంట్ల సవాల్ చేశారు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ నిధులు సాధించడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై స్పందన లేదని ఆరోపించారు. ఈ ప్రాంత సమస్యలపై అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ కేసీఆర్ మార్గదర్శకత్వంలో మునుగోడులో వందల కోట్లతో పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఫ్లోరైడ్ నిర్మూలన, మున్సిపల్ వ్యవస్థ బలోపేతం వంటి కార్యక్రమాలను చేపట్టినట్లుగా తెలిపారు. ప్రస్తుతం రైతులు, సాధారణ ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. మునుగోడు అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేయాలని, ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, భవిష్యత్తులో ప్రజా అనుకూల పాలన తిరిగి వస్తుందని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, పార్టీ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, నాయకులు ఊడుగు మల్లేష్ గౌడ్, ముటుకులోజు దయాకరాచారి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ అక్రెడిటేషన్ కమిటీ ఏర్పాటులో గందరగోళం

### మీడియా వర్గాల్లో ఆగ్రహం



కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 22 : హైదరాబాద్ జిల్లా అక్రెడిటేషన్ కమిటీ ఏర్పాటు తీవ్ర అభ్యంతరాలకు, వివాదాలకు దారితీసింది. రాష్ట్రంలో ప్రముఖ పత్రికలైన ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, వెలుగు, నమస్తే తెలంగాణ లాంటి ప్రధాన మీడియా సంస్థలను విస్మరించి, కమిటీలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం పట్ల అధికారుల వైఖరిపై మీడియా వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అంతేకాకుండా, ఫోటో జర్నలిస్టుల యూనియన్, ఉర్దూ జర్నలిస్టుల యూ నియన్, వీడియో జర్నలిస్టుల యూనియన్, ఎలక్ట్రా నిక్ మీడియా యూనియన్లు ప్రతిపాదించిన సభ్యు లను లెక్కల్లోకి తీసుకోకుండా, తమకు అనుకూలమైన వ్యక్తు లకు, పైరవీకారులకు మాత్రమే అధికారులు కమిటీలో సభ్యులుగా నియమించు కున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంవత్సరాల తరబడి మీడియా రంగానికి సేవలందిస్తున్న అనుభవజ్ఞులను జర్నలిస్టులను విస్మరించి, కొత్తగా ఎంపిక చేసిన సభ్యుల నియామకం మరింత వివాదాస్పదంగా మారింది.ఈ విషయంపై పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రధాన యూనియన్ల బాధ్యులు అధికారులను ప్రశ్నిస్తే, బాధ్యతా రహితమైన సమాధానాలు ఇవ్వడం విస్మయం కలిగిస్తుంది. డిపిఆర్ఓను సంప్రదిస్తే తమ ప్రమేయం లేదని, కలెక్టర్‌కి తెలుసు అంటూ తప్పుకోవడం. కలెక్టర్‌ను సంప్రదిస్తే తమకు పైస్థాయి నుంచి అందిన ఆదేశాల మేరకే కమిటీని ఏర్పాటు చేసాం అంటూ దాటేయడం గందరగోళాన్ని మరింత పెంచుతోంది. కలెక్టరేట్ బీట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనుభవజ్ఞులైన ప్రముఖ పత్రికల సీనియర్ జర్నలిస్టులకు అవకాశం కల్పించకుండా కమిటీ ఏర్పాటు చేయడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై పారదర్శకత లేకపోవడం, పక్షపాత ధోరణి కనిపిస్తుండడంతో మీడియా వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. తక్షణమే కమిటీని పునర్మించి, అనుభవం ఉన్న జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రముఖ వ్యాపారవేత్త కామిశెట్టి శ్రీనివాసులకు ఘన నివాళులు అర్పించిన - ఉప్పల లింగస్వామి- నీళ్ల లింగస్వామి గౌడ్

వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంనికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కామిశెట్టి శ్రీనివాసులు అనారోగ్యంతో మంగళవారం రోజున మృతి చెందిన విషయం తెలుసుకొని హైదరాబాద్ హయత్ నగర్ లోని వారి నీవాసంలో శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సంస్థాన్ నారాయణపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీళ్ళ లింగస్వామి గౌడ్

## శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

### రవీంద్ర భారతికి ప్రతి సగరుడు కుటుంబ సభ్యులతో పాల్గొనాలి - లావణ్య శ్రీరామ్ సగర



వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సగర గౌరవ కార్యవర్గ సభ్యులకు,అనుబంధ కమిటీలకు,సగర బంధుమిత్రులకు ఈనెల 23వ తేదీన హైద్రాబాద్, రవీంద్ర భారతి వేదిక గా రాష్ట్ర ప్రభుత్వం చే,రాష్ట్ర సగర సంఘం అధికారికంగా నిర్వహించబడుతున్న మన కులదైవమైనటువంటి శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ కార్యాలయలో ప్రభుత్వ అధికార కార్యాలయాలో , ఎంపీ ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎమ్మెల్యే కార్యాలయాల్లో, పార్టీ ఆఫీసుల్లో, మీ జిల్లాలలో మీ మీ గ్రామ మండల స్థాయిలో ఉత్సవాలు జరుపుకొని మధ్యాహ్నం 1 : 00 కు రవీంద్ర భారతి లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నటువంటి ఈ కార్యక్రమానికి సగర బంధువులందరూ విధిగా పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత, ప్రతి ఒక్క సగరునిపై ఉంది.ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలసి రావాల్సిందిగా సగర మీడియా ప్రతినిధిగా ఆహ్వానం పలుకుతునము అన్నారు రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జి లావణ్య శ్రీరామ్ సగర

## హైదరాబాదులో ఎన్ యు జె (ఐ)జాతీయ మహాసభలు



కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 22 : నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా)ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 23, 24 తేదీలలో నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్ హోటల్ శ్రీ వేద ప్రీమియంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా 23వ తేదీ ఉదయం 10 గంటలకు 'తెలంగాణ రైజింగ్: ప్రోగ్రెస్ జర్నీ – మీడియా విట్నెస్' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వివరించారు. ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ విశిష్ట అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. రెండు రోజులపాటు జరుగునున్న జాతీయ కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## శ్రీశ్రీశ్రీ భగీరథ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కేటీఆర్ కు ఆహ్వానం

### రాష్ట్ర ప్రజలకు భగీరథ జయంతి శుభాకాంక్షలు తెలిపిన- కేటీఆర్



వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో

శ్రీశ్రీశ్రీ భగీరథ జయంతి సందర్భంగా కేంద్ర పార్టీ కార్యాలయంలో జరుగుతున్న కార్యక్ర మానికి హాజరుకావాలని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టీ రామారావును ఆహ్వానించిన పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హెచ్ విజయేందర్ సాగర్, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వేముల భాస్కర్, కేటీఆర్ ను ఆహ్వానించారు వారు ఈ సందర్భంగా సానుకూలంగా స్పం దించి ముందుగా సగరులకు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు



## కొత్తపేట లో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి 22

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి మీను రాజగంగు, అలాగే హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షులు అల్లకొండ చంద్రశేఖర్, గ్రామ పెద్దలు భోగ మల్లయ్య, చింతలపల్లి గంగారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ తునికి రంజిత్, గుగ్గిల రాము, డాక్టర్ గంగాధర్, బత్తిని రాజేశం, ఘనవేని అశోక్, పుల్ల కిషన్, అంతడుపుల గంగారం, తునికి నరేష్, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఘనంగా 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం






వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 22

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున ప్రపంచ ధరిత్రీ దినోత్సవం (వరల్డ్ ఎర్త్ డే ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, భూతాపం (గ్లోబల్ వార్మింగ్ ) తగ్గించడం, ప్లాస్టిక్ రహిత సమాజంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం వల్ల భూమి మనుగడ ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు సురక్షితమైన భూమిని అందించాలంటే ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయులు బొమ్మకంటి రవికుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల వస్తున్న మార్పులను వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని, ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. "మన భూమి – మన భవిష్యత్తు" అనే నినాదంతో పర్యావరణాన్ని కాపాడుకుంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలను నాటారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసంతరావు, రాజేం దర్, రాజశేఖర్, జీవన్ రెడ్డి, మల్లారెడ్డి, రజిత, రతిలాల్, ఆనంద్ గ్రామస్తులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 22

చౌటుప్పల్ మండల కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో ఎంజేఫ్ లయన్ సిలువేరు మంగయ్య సౌజన్యం తో 30 మంది పోలీస్ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ సిఐ విజయ మోహన్ పాల్గొని మాట్లాడుతూ వేసవికాలంలో మజ్జిగ ఒక అద్భుతమైన, చల్లని పానీయం. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి, ఎండదెబ్బ నుండి రక్షిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడం, శరీర ఉష్ణోగ్రతను తగ్గించడం, మరియు విటమిన్లు, ప్రోటీన్లను అందించడం ద్వారా మజ్జిగ వేసవిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఎంజేఫ్ లయన్ సిలువేరు మంగయ్య సౌజన్యంలో ఈ కార్యక్రమం చేయడం చాలా సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంజేఫ్ లయన్ తిరందాసు జగన్,సెక్రెటరీ ఎంజేఫ్ లయన్ మహమ్మద్ అత్తర్ పాషాలయన్ ఎం జెఎఫ్ సభ్యులు నాంపల్లి రమేష్, కాసుల వెంకటేశం,కటికం ప్రశాంత్,కోసం రామ్ రెడ్డి,కంసుడు చంద్రశేఖర్,దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా,డియర్ వేముల నరసింహ, చింతల ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళితరత్న అవార్డ్ గ్రహీతకు ఘనంగా సన్మానం



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 22

దళితుల అభ్యున్నతి కోసం ఊదరి నరసింహా చేసిన కృషికి నిదర్శనమే దళిత రత్న అవార్డు అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో దళిత రత్న అవార్డు గ్రహీత ఊదరి నరసింహ కు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ఊదరి నరసింహ దళితుల అభ్యున్నతి కోసం విశేషమైన కృషి చేస్తూ, దళితుల పక్షాన నిలబడ్డ వ్యక్తిని వారన్నారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగిన దళితుల పక్షాన నిలబడి దళితుల అస్తిత్వం కోసం గలమెత్తి, పోరాటాన్ని ఆచరణలో పెట్టే వ్యక్తి ఊదరి నరసింహా అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి పాల్గొని మాట్లాడుతూ బలహీనవర్గాలకు సేవ చేయడంలో నరసింహ ముందుభాగంలో నిలుస్తాడని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కూమార్, కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, మార్కెట్ డైరెక్టర్లు బోయ వెంకట్, శంకర్ నాయక్, అడ్వకేట్ కట్టెల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు సుక్క అర్జున్, మాజీ కౌన్సిలర్ కోరగోని లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు దొనకొండ కృష్ణ,ఎమ్మార్పీఎస్ తాళ్ళ సింగారం గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

## బైక్ లు వద్దు సైకిల్ ముద్దు, ఇంధన పొదుపు అవగాహన ర్యాలీ



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 22పర్యావరణ పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పర్యావరణ అంశాలపై దృష్టి సారిస్తూ బుధవారం రోజు విద్యా సంస్థ ల్లో ఏప్రిల్ 22న అంతర్జాతీయ ధరిత్రీ దినోత్సవశీ సందర్భంగా పర్యావరణ స్పృహను పెంపొందిస్తూనే, విద్యార్థుల భద్రతను దృష్టి లో ఉంచుకొని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామ పుర వీధులు గుండా బైక్ లు వద్దు సైకిల్ ముద్దు అంటూ ఇంధన పొదుపు గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీ తీసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యూ.వి. రమణీ, సీనియర్ ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య,ఉపాధ్యాయులు శంకరయ్య, సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, కమారుద్దీన్, వేణు గోపాల్, రాజగోపాల్, సురేష్, పుష్పలత, భవాని, శైలజ వంశీధర్ రావు, సాయబు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏటీఎం ద్వారా పీఎఫ్ నగదు విత్ డ్రా.. కేంద్రం నుంచి కొత్త అప్డేట్.. ఎలా తీసుకోవాలంటే..?



త్వరలోనే పీఎఫ్ నగదును ఏటీఎం ద్వారా విత్ డ్రా చేసుకునే సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీని ద్వారా పీఎఫ్ ఖాతాదారులు తమ అకౌంట్లోని 50 శాతం నగదును ఉపసంహరించుకోవచ్చు. ఇందుకోసం ఒక ప్రత్యేక ఏటీఎం కార్డును జారీ చేయనున్నారు. త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి తీపికబురు. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులను విత్ డ్రా చేసుకోవాలంటే ఈపీఎఫ్‌వో వెబ్‌సైట్ లేదా ఉమాంగ్ యాప్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. వాటిల్లో ఏదైనా ఒక ఫ్లాట్‌ఫామ్‌లోకి వెళ్లి బ్యాంక్ అకౌంట్ వివరాలు, అవసరమైన డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డాక్యుమెంట్స్ స్కాన్ చేసి అప్ లోడ్ చేయాల్సిన అవసరముంది. అయితే ఇక నుంచి కాగితపు పని ఉండదు. పీఎఫ్ విత్ డ్రాలో పేపర్‌లెస్ ప్రక్రియకు ఈపీఎఫ్‌వో శ్రీకారం చుడుతోంది. ఇక నుంచి మీరు పీఎఫ్ బ్యాలెన్స్ తీసుకోవాలంటే ఎలాంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన పని లేదు. కేవలం నిమిషాల్లోనే ఏటీఎం నుంచి తీసేసుకోవచ్చు. ఇది ఎలా తీసుకోవాలి అనేది ఇప్పుడు చూద్దాం.ఏటీఎం ద్వారా ఎలా తీసుకోవాలి..?ఈపీఎఫ్‌వో ఒక ప్రత్యేక పీఎఫ్ ఏటీఎం కార్డును ఖాతాదారులందరికీ జారీ చేయనుంది. బ్యాంకులు డెబిట్ కార్డులు జారీ చేసినట్లుగానే.. పీఎఫ్ ఏటీఎం కార్డును ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అందించనుంది. ఈ ప్రత్యేక పీఎఫ్ ఏటీఎం కార్డు ఉపయోగించి మీరు ఏ బ్యాంక్ ఏటీఎం నుంచి అయినా మీ పీఎఫ్ అకౌంట్లోని నగదును విత్ డ్రా చేసుకోవచ్చు. ఎలా అయితే ఒక బ్యాంక్ డెబిట్ కార్డు ఉపయోగించి మరో బ్యాంక్ ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేసుకుంటున్నారో.. అదే తరహాలో పీఎఫ్ ఏటీఎం కార్డు ద్వారా డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చు. అయితే ఏటీఎం కార్డు ఉపయోగించి కేవలం మీ పీఎఫ్ బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు నగదును మాత్రమే విత్ డ్రా చేసుకోవచ్చు. నేషనల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి కొత్త చెల్లింపుల వ్యవస్థను ఈపీఎఫ్‌వో అభివృద్ధి చేస్తోంది.యూపీఐ ద్వారా విత్ డ్రా..?ఇక యూపీఐ ద్వారా కూడా పీఎఫ్ బ్యాలెన్స్‌ను సెకన్లలోనే విత్ డ్రా చేసుకోవచ్చు. భీమ్ యాప్‌లో తొలుత ఈ సదుపాయం రానుండగా.. అనంతరం పేటీఎం, పేటీఎం, గూగుల్ పే లాంటి అన్ని యాప్‌లలో ప్రవేశపెట్టనున్నారు. ఏప్రిల్ నుంచే ఈ సౌకర్యం అందుబాటులోకి రావాల్సి ఉండగా.. కొన్ని టెక్నికల్ కారణాల వల్ల ఆలస్యమైంది. మే నుంచి ఈ సుదుపాయం అందుబాటులోకి వస్తుందని తెలుస్తోంది. యూపీఐ ద్వారా మీ పీఎఫ్ బ్యాలెన్స్‌లోని 75 శాతాన్ని విత్ డ్రా చేసుకోవచ్చు. మిగతా 25 శాతం మినిమం బ్యాలెన్స్ కింద ఉంచాల్సి ఉంటుంది. ఉద్యోగం మానేశాక ఈ 25 శాతం నగదును తీసుకోవచ్చు. ఇక రూ.5 లక్షల వరకు నగదును ఆటో సెటిల్మెంట్ చేసేలా ఈపీఎఫ్‌వో కొత్త రూల్స్ తీసుకొచ్చింది.